క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: కాజీపేట పరిధిలోని నిట్, సోమిడి 11కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని హనుమకొండ డీఈఈ సాంబరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫాతిమానగర్, అఫ్జల్‌నగర్, రామాలయం ఏరియా, దర్గా ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సోమిడి సబ్ స్టేషన్ పరిధిలోని విష్ణుపురి, వాటర్ ట్యాంక్, పోలీస్‌స్టేషన్, వెంకట్‌రెడ్డి ఆస్పత్రి, సోమిడి ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బాక్సింగ్‌లో చందన ప్రతిభ



వరంగల్: శ్రీమేధా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, సుందరయ్యనగర్‌కు చెందిన వై.చందన అండర్ -19లో 45 - 50 కిలోల విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరించిందని కళాశాల ప్రిన్సిపాల్ వీరన్నగౌడ్ తెలిపారు. గోల్డ్‌మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన చందనను ప్రిన్సిపాల్‌తో పాటు డైరెక్టర్ కుమార్‌గౌడ్, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

పెద్దపల్లికి తరలిన అభ్యర్థులు



హన్మకొండ అర్బన్: టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ -4 పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైన జిల్లాకు చెందిన 208 మంది అభ్యర్థులు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకునేందుకు పెద్దపల్లికి బుధవారం తరలివెళ్లారు. వారికోసం హనుమకొండ కలెక్టరేట్ నుంచి ఐదు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయగా, హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.

నాసా కిట్ల అందజేత



కాజీపేట అర్బన్: హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులకు నాసా కిట్లను కేయూ కెమిస్ట్రీ ప్రొఫెసర్ సీహెచ్.నాగేశ్వర్‌రావు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నళిని, ఇన్‌చార్జ్ నాగేశ్వర్‌రావు, చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ విద్య, రాజేశ్వర్‌రెడ్డి, శివ, కోటేశ్వర్‌రావు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీతో ఉపాధి అవకాశాలు

కేయూ క్యాంపస్: ఫార్మసీ కోర్సులు చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ అన్నారు. ఓరియెంటేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై కళాశాలలో అవగాహన కల్పించారు. అనంతరం సైబర్ క్రైమ్.. ఒక అవగాహన అనే అంశంపై కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు.

ఇస్రో స్పేస్ ట్యూటర్ భూపతి శశాంక్‌కు సన్మానం

మామునూరు: బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బిగినర్స్ బాష్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిన్న వయసులో ఇస్రో స్పేస్ ట్యూటర్‌గా నియమితులైన హనుమకొండకు చెందిన భూపతి శశాంక్‌ను సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ సన్మానించారు.

కార్యదర్శుల సమస్యలపై వినతి

హన్మకొండ అర్బన్: పంచాయతీ కార్యదర్శుల ఫోరం బాధ్యుల సమస్యలపై టీఎన్జీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా పరిధిలోని సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, రాష్ట్రస్థాయి సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇచ్చినట్లు రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓఎస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నేతలు శ్యామ్‌సుందర్, సారంగపాణి, పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి నరేష్, కోశాధికారి రాజు, కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు రఫీ, వెంకటేశం, శ్రీనివాస్, శ్రీనివాస్, వేణుమాధవ్, యాదగిరి, వెంకన్న పాల్గొన్నారు.

హడావుడి చేసి.. ఆపై వెనక్కి తగ్గి!

- రోడ్డు నిర్మాణానికి రాజకీయ గ్రహణం
- మధ్యలో నిలిచిపోయిన పనులు
- ప్రయాణికులు, వాహనదారుల పాట్లు

హసన్‌పర్తి: రోడ్డు నిర్మాణ పనుల వేగవంతం కోసం ఇటు అధికారులు.. అటు ప్రజాప్రతినిధులు హడావుడి చేశారు. రోడ్డు విస్తరించడానికి మార్కింగ్ కూడా చేశారు. నిర్మాణాలు కూల్చివేస్తామని జేసీబీలు కూడా తీసుకొచ్చారు. అయితే రాజకీయ గ్రహణం వల్ల రోడ్డు పనులను మధ్యలోనే నిలిపివేశారు. ఇది భీమారం - చింతగట్టు మార్గమధ్యలోని రోడ్డు నిర్మాణ పరిస్థితి.

రూ.4 కోట్లు మంజూరు

నగరంలోని 55వ డివిజన్ భీమారం ఇందిరాగాంధీ విగ్రహం నుంచి చింతగట్టు వెళ్లే జాతీయ రహదారిని కలుపుతూ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.4 కోట్లు నిధులు విడుదల చేశారు. తొలిదశలో చింతగట్టు జాతీయ రహదారి నుంచి భీమారం బొడ్రాయి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. రెండో దశ పనుల సందర్భంగా రోడ్డు విస్తరణ సమస్యగా మారింది. భీమారంలోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి బొడ్రాయి పనుల కోసం రోడ్డు వెడల్పు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు.

ఇరువైపులా మార్కింగ్

ఈప్రాంతంలో రోడ్డు విస్తరణ కోసం కుడా అధికారులు ఇరువైపులా మార్కింగ్ వేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉన్నవారు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేష్ వద్దకు వెళ్లి మొర పెట్టుకున్నారు. బాధితులకు న్యాయం చేస్తామని అరూరి రమేష్ హామీ ఇచ్చారు. ఇందిరాగాంధీ విగ్రహం నుంచి చర్చి వరకు విస్తరణ పనులను నిలిపివేశారు. చర్చి నుంచి జమ్మి వరకు విస్తరణ పనులు చేపట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందిరాగాంధీ విగ్రహం నుంచి చర్చి వరకు, జమ్మి నుంచి బొడ్రాయి వరకు నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికుల నుంచి డిమాండ్ వ్యక్తమవుతోంది. ప్రధాన రహదారిలోని ఓ భవనం ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టారని, ఆ నిర్మాణానికి తొలగించినట్లయితే ఈ ప్రాంతంలో ఎవరికి కూడా నష్టం ఉండదని స్థానికులు అప్పటి ఎమ్మెల్యే రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయి వచ్చి పరిశీలించాలని కోరారు.

ప్రయాణికుల పాట్లు

రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోవడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును ఇటీవల స్థానికులు కలిసి రోడ్డు నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన పనుల గురించి వివరించారు. రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. ఈమేరకు ఎమ్మెల్యేకు ప్రజలు వినతిపత్రం అందించారు.



పనులు చేయకుండా వదిలేసిన ప్రధాన రోడ్డు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు (ఫైల్)

పనులు చేపట్టాలి



మధ్యలో నిలిచిపోయిన పనులు వెంటనే చేపట్టాలి. రోడ్డు పనులు నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, పాలకులు దృష్టి సారించాలి.

\- చింత లక్ష్మణ్, దేవస్థాన కమిటీ మాజీ అధ్యక్షుడు

అధికారుల నిర్లక్ష్యమే..



అధికారుల నిర్లక్ష్యం వల్లే రోడ్డు పనులు నిలిచిపోయాయి. రాజకీయాల కారణంగా భీమారం అభివృద్ధి కుంటుపడింది. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

\- ఉప్పు ప్రభాకర్, స్థానికుడు

ఆశ కార్యకర్తల బకాయిలు చెల్లించాలి



హనుమకొండ కలెక్టరేట్ ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు



వరంగల్ కలెక్టరేట్ ఎదుట..

హన్మకొండ అర్బన్: ఆశ కార్యకర్తలకు పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, టీబీ, పల్స్ పోలియో, ఎన్సీడీ సర్వే బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి, ఆశ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌ఓ వైవీ.గణేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్వేత, యాకూబి, కల్పన, సంధ్య, రజిత, శ్రీవాణి, కవిత, శోభ, సూర్యకళ, సరిత, సుకన్య, సునీత, నవమణి పాల్గొన్నారు.

ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి

వరంగల్: రాష్ట్రంలోని ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి, నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని ఆశ వర్కర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆమె మాట్లాడారు. ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, లెప్రసీ, పల్స్‌పోలియో, టీబీ కార్యక్రమాలను విజయవంతం చేసిన ఆశ వర్కర్లకు పెండింగ్ పారితోషికాలు వెంటనే చెల్లించాలని కోరారు. 20 ఏళ్లుగా ఆశ వర్కర్ల సేవలను ప్రభుత్వాలు వినియోగించుకుంటున్నాయని, సామాజిక భద్రత కల్పిస్తూ పదవీ విరమణ పొందిన ఆశ వర్కర్లకు నెలకు రూ.10 వేల పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

కులం, మతం పేరుతో కేంద్రం దాడులు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్



మాట్లాడుతున్న రమేష్

హసన్‌పర్తి: దేశంలో పదేళ్లుగా కులం, మతం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడులు చేస్తూ, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు కొనసాగిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ 68వ వర్ధంతిని సీఐటీయూ, కేవీపీఎస్ హసన్‌పర్తి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కుల కోసం రూపొందించిన రాజ్యాంగాన్ని కాపాడాలని కోరారు. రోజురోజుకు దళితులపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని వాపోయారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య మాట్లాడుతూ వివక్షను రూపుమాపడానికి నిరంతరం ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కార్యదర్శి పుల్లా అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి సంపత్, సీఐటీయూ జీడబ్ల్యూఎంసీ జిల్లా అధ్యక్షుడు బారుపట్ల మహేష్, సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై అకృత్యాలను అరికట్టాలి

మడికొండ: మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, అకృత్యాలను అరికట్టాలని పలువురు సూచించారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాల నివారణ అవగాహన కార్యక్రమాన్ని మడికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మై చాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ మాట్లాడుతూ విద్యార్థినులకు చిన్నతనం నుంచే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలియజేయాలని కోరారు. అనంతరం పాఠశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై చంద్రమౌళి, పాఠశాల హెచ్ఎం సంధ్యారాణి, మై చాయిస్ ఫౌండేషన్ కౌన్సెలర్ రత్నశ్రీ, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, సందెల విజయ్, రవి, శ్రీను, రజిని, వేణుయాదవ్, గుర్రం జ్యోతి, అమర్‌నాథ్, వినయ్, సాయిలు, రాజు, భాస్కర్, సట్ల వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

యూత్ కాంగ్రెస్ ఎన్నిక



రంగనాథ్



పరమేశ్



రేవంత్



వరుణ్

హన్మకొండ చౌరస్తా /వరంగల్ / కాజీపేట అర్బన్ /హసన్‌పర్తి: నాలుగు నెలల క్రితం ఆన్‌లైన్ ద్వారా జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. హనుమకొండలోని 4వ డివిజన్ కృష్ణాకాలనీకి చెందిన యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు రేపల్లె రంగనాథ్ 17వేల పైచిలుకు ఓట్లతో యువజన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు.వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కొరివి పరమేశ్ విజయం సాధించినట్లు కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన కట్కూరి రేవంత్.. యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. యూత్ కాంగ్రెస్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వరుణ్ ఎన్నికయ్యారు.

7న రాష్ట్ర వ్యాప్తంగా ఆటోల బంద్



మాట్లాడుతున్న సంజీవ

నయీంనగర్: ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఒక రోజు బంద్‌ను ఆటో, క్యాబ్ డ్రైవర్లు విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆటో జేఏసీ పిలుపునిచ్చింది. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకుడు ఇసంపెల్లి సంజీవ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఆటో డ్రైవర్లను పట్టించుకునే పరిస్థితులు కానరావడం లేదని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు జీవన భృతి కింద నెలకు రూ.12 వేలు, ప్రత్యేక బోర్డు, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్, రూ.5 వేల పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో బాబు, వెంకన్న, జయరాం, శ్రీధర్‌రెడ్డి, సంజీవ, సాయిలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై దాడి కేసును ఛేదించిన పోలీసులు



పరిస్థితిని సమీక్షిస్తున్న ఏసీపీ, ఇన్‌స్పెక్టర్

- పోలీసుల అదుపులో నిందితుడు?

కాజీపేట: కాజీపేట పట్టణంలో బ్రిక్స్ వ్యాపారిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనను పోలీసులు చాకచాక్యంగా వ్యవహరించి కేసును ఛేదించడంతో పాటు నిందితుడిని పట్టుకున్నట్లు సమాచారం. డీజిల్ కాలనీలో వ్యాపార లావాదేవీలు ముగించుకుని ఇంటికి వెళ్తున్న అలువాల మాలకొండయ్యపై అదే కాలనీకి చెందిన యువకుడు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. 78 ఏళ్ల వృద్ధుడని కూడా చూడకుండా నిర్దాక్షిణ్యంగా కత్తితో ఇష్టారీతిగా పొడవడంతో తీవ్రంగా గాయపడ్డారు. నిందితుడు కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దాంతో శరీరంపై సుమారు 11 కత్తిపోట్లు ఉన్నట్లుగా వైద్యులు చెప్పారు. నిందితుడితో పాటు అతడు ఉపయోగించిన కత్తితో పాటు పెట్రోల్ కవర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మంత్రి అసమర్థతతో కుంటుపడిన అభివృద్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

వరంగల్ / ఖిలా వరంగల్: మంత్రి కొండా సురేఖ అసమర్థతతో వరంగల్ అభివృద్ధి కుంటుపడిందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆరోపించారు. ఈమేరకు కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలు ప్రజలకు తెలిసేలా వరంగల్ రంగశాయిపేటలోని మహంకాళి గుడి వద్ద నుంచి పోచమ్మమైదాన్ జంక్షన్ వరకు బీజేపీ నాయకులు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ హాజరై బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం సతీష్‌షా, తాబేటి వెంకట్‌గౌడ్‌తో కలిసి జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ఏడాది పాటు అరాచక పాలనే కాంగ్రెస్ విజయమా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసి, ఎన్నికల హామీలను పక్కన పెట్టి విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని ఆరోపించారు. కార్యక్రమంలో పరమేశ్వర్, బైరి నాగరాజు, బాకం హరిశంకర్, రంజిత్, రఘునారెడ్డి, గడల కుమార్, దీన్‌దయాళ్, ఆనంద్, లూథర్, శిల్ప, గోవింద్‌సింగ్, భరత్ వీర్, కర్నె రవీందర్, బోరిగం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



శిలా ఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

మామునూరు: నియోజవర్గం, విలీన గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగుతోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ఈమేరకు వరంగల్ 43వ డివిజనలోని పలు కాలనీల్లో రూ.3కోట్ల 11 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులకు నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని డివిజన్లలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కాలనీల్లో సమస్యలు ఉంటే 80961 07107 నంబర్‌కు ఫోన్ చేసి తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదుల అరుణ, గంట నరేందర్‌రెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మడికొండ: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయలు కోరారు. ఈమేరకు సుబేదారిలోని క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్తంగా

అధికారికంగా నిర్వహించాలి

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినాన్ని అధికారికంగా నిర్వహించాలని జ్వాలా వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం లేఖ రాశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విద్యారణ్యపురి: అవినీతి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలను బుధవారం నిర్వహించారు. అవినీతి ఏవిధంగా ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను బలహీన పరుస్తుంది అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఆటోలో బ్యాగు మరిచిపోయానని ఫిర్యాదు

హన్మకొండ చౌరస్తా: కంపెనీ ప్రచార నిమిత్తం ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ అక్కడే పార్కింగ్ చేసిన ఆటోలో బ్యాగు పెట్టి మరిచిపోయానని, అందులో విలువైన వస్తువులు ఉన్నాయని, ఆ బ్యాగును తనకు తిరిగి అప్పగించేలా చూడాలని బాధితుడు కోరారు. ఈమేరకు హనుమకొండ పోలీసులకు లిఖిత పూర్వకంగా బుధవారం ఫిర్యాదు చేశారు.

హక్కుల సాధనకు డీఎస్పీ రిలే నిరాహార దీక్షలు

వరంగల్: పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, రెండు వందల గజాల్లో నాలుగు గదుల ఇల్లు సాధించేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నాలుగు రోజుల పాటు ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్ తెలిపారు. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని రిలే నిరహార దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కాజీపేట: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ సూచించారు. అంబేడ్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకుని 75ఏళ్ల భారత రాజ్యాంగ వార్షికోత్సవం - సవాళ్లపై కాజీపేట 62వ డివిజన్ సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో రెండో రోజు బుధవారం సదస్సు నిర్వహించారు. సమావేశంలో రొంటాల కోటేశ్వర్, టి.ఉప్పలయ్య, ఓరుగంటి సాంబయ్య, కారు ఉపేందర్, మంద సంపత్, గడ్డం అశోక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆచరణకు నోచుకోని ఆరు గ్యారంటీలు

వరంగల్: కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాది పూర్తైన సందర్భంగా సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ పార్టీ.. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను నేటికీ అమలు చేయలేదని ఐఎఫ్‌టీయూ (ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ విమర్శించారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు దయాకర్, నాయకులు సాంబయ్య, నర్సింగ్, కుమార్, రవి, ప్రదీప్, రమేష్ పాల్గొన్నారు.

సేవాలాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతి

కేయూ క్యాంపస్: తెలంగాణ సేవాలాల్ సేన విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాకతీయ యూనివర్సిటీ గిరిజన విద్యార్థి నాయకులు మానాల తిరుపతి నాయక్‌ను నియమించినట్లు సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భూక్య సంజీవ్ నాయక్ బుధవారం తెలిపారు.

ఎగ్ కార్ట్స్ పథకంతో యువతకు ఉపాధి

వరంగల్: నెక్ జాతీయ అధ్యక్షురాలు అనురాధ దేశాయ్ డ్రీమ్స్ ప్రాజెక్టు ఎగ్ కార్ట్స్‌తో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని నెక్ వరంగల్ జోన్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఓసిటీలోని తన నివాసంలో 50మంది లబ్ధిదారులకు ఎగ్ కార్ట్స్‌ను బుధవారం పంపిణీ చేశారు.

కేంద్రం బీసీల లెక్క తేల్చాల్సిందే

కాజీపేట రూరల్ / విద్యారణ్యపురి: కేంద్ర ప్రభుత్వం బీసీల లెక్క తేల్చాలని, చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న మహాధర్నా కార్యక్రమానికి కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి వెళ్లిన బీసీ విద్యార్థి సంఘం నాయకులను వేణుగోపాల్‌గౌడ్ జెండా ఊపి రైల్‌లో ఢిల్లీకి పంపించారు.

విజయోత్సవాలను విజయవంతం చేయాలి

వరంగల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలను విజయవంతం చేయాలని 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబు కోరారు. ఈమేరకు డివిజన్‌లోని అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాలలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు పంపిణీ చేశారు.

అనర్హుల ఓట్లను తొలగించాలి

విద్యారణ్యపురి: ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో కొంతమంది పేర్లు నిబంధనలకు విరుద్ధంగా నమోదు అయ్యాయని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, బాధ్యులు తెలిపారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అనర్హుల పేర్లను తొలగించాలని కోరుతూ హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

హెడ్ కానిస్టేబుల్ కొడుకుకు సన్మానం

వరంగల్ స్పోర్ట్స్: అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్ కుమారుడిని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా బుధవారం సన్మానించారు. మడికొండలోని పోలీసు శిక్షణా కేంద్రంలో ట్రైనర్‌గా విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ తమిళ ఆనందం కుమారుడు సాయివంశీ గతనెల 7నుంచి 10వ తేదీ వరకు గోవాలో జరిగిన ఎఫ్ఎస్‌కెఏ ప్రపంచ కరాటే చాంపియన్‌షిప్‌లో స్పారింగ్ విభాగంలో సిల్వర్, కటాస్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న మాదిగ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును బుధవారం కలిసి వినతిపత్రం అందించారు.

గర్భిణులకు సీమంతం

ఖిలా వరంగల్: కరీమాబాద్‌లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, మాధవి సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు.

దివ్యాంగులను కంటికి రెప్పలా కాపాడుకోవాలి

న్యూశాయంపేట / కాజీపేట అర్బన్: మానసిక దివ్యాంగులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్.రమేశ్‌బాబు గుర్తుచేశారు. హనుమకొండలోని స్పందన మనోవికాస కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో సుమారు 24 మంది మానసిక వికలాంగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సాయికుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ ఎస్.మనోహర్, ప్రహిసితా, శ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

వరంగల్: ముదిరాజ్‌ల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, అందరి మన్ననలు పొందుతానని సంఘం అధ్యక్షుడు బిల్లా శివశంకర్ ముదిరాజ్ అన్నారు. కాశిబుగ్గ ఏరియా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శివశంకర్.. బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. నీతి, నిజాయితీతో నిష్పక్షపాతంగా నిర్వహిస్తానని, కులానికి పేరు వచ్చే విధంగా కష్టపడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కె.దేవేందర్, ఉపాధ్యక్షుడు జి.తిరుపతి, ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, కోశాధికారి ఎస్.వేణుగోపాల్, కె.పవన్, సహాయ కార్యదర్శులు ఇ.శ్రీనివాస్, ఆర్గనైజర్లుగా కె.రాజు, వి.రాజు, కార్యదర్శులు కె.నవీన్, చిన్నరాజు, సూరయ్య, గౌరవ సలహాదారులు బయ్యస్వామి, కూరకుల పెద్ద రాజు, మేడి రాజు, కె.సుధాకర్, కూరకుల చిన్నరాజు, మోటం శ్రీనివాస్ పాల్గొన్నారు.



కాశిబుగ్గ ముదిరాజ్ సంఘం నాయకులు